## నేడు విద్యుత్ సరఫరా బంద్

బేగంపేట్ జనవరి 23: విద్యుత్ లైన్‌లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా బుధవారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఐదు ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్యారడైజ్ సర్కిల్ విద్యుత్ ఏడీఈ అధికారులు తెలిపారు. సెయింట్ మేరీస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అలాగే సంగీత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రైల్వే రిజర్వేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 సాయంత్రం 4 గంటల వరకు, స్టేషన్ రోడ్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు మినర్వా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం3నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రాష్ట్రపతి రోడ్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌లో సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

# పురాతన కట్టడాలను కాపాడుకోవాలి

### డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: పురాతన కట్టడాలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. నిజాం హయాంలో నిర్మించిన పురాతన కట్టడం లాలాపేట కమాన్‌ను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి టీఎస్ఎస్‌పీడీసీఎల్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న కమాన్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కమాన్‌కు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలు, వేర్ల వల్ల కమాన్ కూలిపోయే స్థితికి చేరుకుందని, వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. కమాన్‌పై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నందున టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు కూడా సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో డీఈ శ్రీధర్, ఏఈ రాజేశ్, హార్టికల్చర్ విభాగం తార్నాక ఇన్‌చార్జి సింధూజ, ఏఈ వెంకటేశ్, ఎంటమాలజీ విభాగం రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

## టైపిస్ట్, స్టెనో ఉద్యోగాల పునరుద్ధరణకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: టైపిస్ట్, స్టెనో ఉద్యోగాల పునరుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. తెలంగాణ టైపిస్ట్ నిరుద్యోగుల సంఘం, తెలంగాణ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్, కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన బల్మూరి వెంకట్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ టైప్, షార్ట్‌హ్యాండ్ ఉద్యోగాలకు ఆటంకంగా మారిన జీవో నెంబర్ 145ను తొలగించి, పోస్టుల పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీకే సాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మసూద్ అలీ, కోశాధికారి శేఖర్, ప్రతినిధులు ప్రశాంత్, గిరీశ్, శ్రీకాంత్, యశ్వంత్, రాములు, ప్రభాకర్‌చారి, నర్సిరెడ్డి, మోహన్, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నెమలిని రక్షించిన పోలీసులు



నెమలిని అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఉస్మానియాక్యాంపస్‌లో వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన నెమలిని పోలీసులు రక్షించారు. సెక్యూరిటీ సిబ్బంది సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నెమలికి ప్రథమ చికిత్స చేసి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

## సీపీఆర్‌పై అవగాహన

మెహిదీపట్నం జనవరి23 : గుండె నొప్పి వచ్చిన సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా నేతృత్వంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ.. అపస్మారక పరిస్థితులలో సమయస్ఫూర్తి అవసరం అన్నారు.

## సర్కారు బడిలో మాక్ పార్లమెంట్




పికెట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మారేడ్‌పల్లి, జనవరి 23: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ పరిధి పికెట్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో మంగళవారం మాక్ పార్లమెంట్‌ను ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో ఏ విధంగా ఉంటుంది, ఎంపీలు ప్రజా సమస్యలను ఏ విధంగా ప్రస్తావిస్తారు అనే తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మాక్‌పార్లమెంట్‌లో 90 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'ప్రతి పరిశోధక విద్యార్థికి నాన్‌నెట్ ఫెలోషిప్ మంజూరు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: యూనివర్సిటీల్లో పరిశోధనలు చేస్తున్న ప్రతి పరిశోధక విద్యార్థికి నాన్‌నెట్ ఫెలోషిప్ మంజూరు చేయా లని తెలంగాణ స్టూడెం ట్స్ పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్న త విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జేఏసీ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ మాట్లాడుతూ ప్రతి పరిశోధక విద్యార్థికి నాన్ నెట్ ఫెలోషిప్ కింద రూ.30,000 మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన లింబాద్రి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు రవి, శ్రీను, రాము, సునీల్ శెట్టి, స్వామి, రాహుల్, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు



కంటోన్మెంట్‌లో వెలిసిన బ్యానర్‌లు, కటౌట్‌లను తొలగిస్తున్న బోర్డు సిబ్బంది

## బ్యానర్లు, కటౌట్లు తొలగింపు

కంటోన్మెంట్, జనవరి 23: కంటోన్మెంట్ వ్యాప్తంగా వెలసిన బ్యానర్లు, కటౌట్లను కంటెన్మెంట్ బోర్డు అధికారుల ఆదేశాలతో సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని కంటోన్మెంట్ వ్యాప్తంగా బీజేపీతో పాటు, పలు పార్టీల నాయకులు ఆలయాల వద్ద భారీగా బ్యానర్లు ఏర్పాటు చేశారు. రాములవారి ఆలయం ప్రారంభోత్సవం వరకు వేచి ఉన్న అధికారులు ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తి కాగానే మంగళవారం నుంచి బ్యానర్ల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. పోలీసు పహారాలో భారీగా వెలసిన బ్యానర్లను తొలగించారు. ఈ పరిస్థితి చూస్తుంటే మరి కొద్ది నెలల్లో పార్లమెంట్ ఎలక్షన్స్ ఉన్న నేపథ్యంలో బీజేపీకి క్రెడిట్ దక్కకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

## 'ఆయుష్మాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. ఆ మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ ఆయుష్మాన్ భారత్ బీమా పథకంతో తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులు రూ.10 లక్షల వరకు ప్రైవేటు, ప్రభుత్వ దవాఖానలలో చికిత్స చేయించుకోవచ్చని తెలిపారు.

# ఓయూలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కాశిం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం – 2020 మొత్తం లోపాల పుట్ట అని వారు ఆరోపించారు. ప్రజలందరూ దాన్ని తిరస్కరించాలని కోరారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. నూతన విధానంలో ప్రైవేట్ యూనివర్సిటీలు, విదేశీ యూనివర్సిటీలను సైతం అనుమతిస్తారని చెప్పారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు సమరశీల ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మణికంఠరెడ్డి, గ్యార నరేశ్, క్రాంతి, నెల్లి సత్య, రహమాన్, ఉదయ్, లెనిన్, శివ, చైతన్య, అన్వర్, వంశీ, చిన్నా, గోపి, హరీశ్, అరుణ్, శ్రీకాంత్, అశ్విన్, మధు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న విద్యార్థి నాయకులు

## రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభం




చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిబంధనల ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నల్లకుంట ట్రాఫిక్ సీఐ నాగరాజు, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. రోడ్డుపై నడిచేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని సూచించారు. అవసరమైతే ఫుట్ ఓవర్ బ్రిడ్జి వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సైలు నిరంజన్, శ్రీధర్, ఏఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**నియామకం:** తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ మహబూబాబాద్ జిల్లా చైర్మన్‌గా పంతం విజయేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను రాయ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీలోని ఉపాధ్యక్షుడు పంతం సురేందర్, ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్యామ్, కార్యదర్శి వేల్పుకొండ సురేశ్, సంయుక్త కార్యదర్శి యనమాల రాజు, ఓయూ అధ్యక్షుడు పట్ల నాగరాజు, హేమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23

## బ్యాడ్మింటన్ పోటీ విజేతగా సికింద్రాబాద్ షటిల్ రైడర్స్




బ్యాడ్మింటన్ పోటీ విజేత సికింద్రాబాద్ షటిల్ రైడర్స్‌ను అభినందించిన నిర్వాహకులు

బన్సీలాల్‌పేట్, జనవరి 23 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మారావు నగర్‌లోని అభినవనగర్ యూత్ అసోసియేషన్, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌జోన్ బ్యాడ్మింటన్ పోటిలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో చిలకలగూడకు చెందిన సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ (ఎస్ఎస్ఆర్) జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథులుగా హాజరైన అభినవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీవ్ దేశ్‌పాండే, కార్యదర్శి ఎస్‌వి.రెడ్డి, పూర్వ అధ్యక్షుడు రాజేశ్ గౌడ్ విజేతలకు షీల్డ్‌లను అందజేశారు. సికింద్రాబాద్ రాకెట్ రైడర్స్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు ఈ.చంద్రశేఖర్ బెస్ట్ ప్లేయర్ అవార్డు గెలుచుకున్నారు. రిఫరీలుగా సుధీర్, కృష్ణయాదవ్, మోహన్‌రంగా, మధుసూధన్‌రెడ్డి వ్యవహరించారు.



సికింద్రాబాద్: వారాసిగూడ చౌరస్తాలో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ హేమ,బీఆర్ఎస్ నాయకులు శైలేందర్,జాకీర్,ఆరిఫ్,లలిత




ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్, కోశాధికారి రోహిత్, నాయకులు ముబీన్, అరవింద్, మనోజ్, నితిన్

# స్వాతంత్రోద్యమంలో నేతాజీ సేవలు మరువలేనివి

మారేడ్‌పల్లి, జనవరి 23: భారతదేశ స్వాతంత్రోద్యమంలో ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం సుభాష్ చంద్ర బోస్ జయంతిని సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న నేతాజీ విగ్రహానికి బండారు దత్తాత్రేయ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, నాయకులు బి. గౌరిశంకర్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, రవీందర్, అశోక్‌కుమార్, సురేశ్, కార్పొరేటర్ దీపిక, నరేందర్, తరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ, నాయకులు



సికింద్రాబాద్: వారాసిగూడ చౌరస్తాలో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కంటోన్మెంట్: న్యూ బోయిన్‌పల్లి నేతాజీనగర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి , బీఆర్ఎస్ నాయకుడు మధుకర్



# మీడియా ప్రతినిధులకు ప్రతిభా పురస్కారాలు

ముషీరాబాద్, జనవరి 23: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మీడియా ప్రతినిధులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ బి. శేషశయనారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ మీడియా సంస్థలలో పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి, రామరాజు శ్రీనివాసరావు, బొప్పన నరసింహారావు, కుసుమ బోగరాజు, గోపరాజు రవికుమార్, విజయలక్ష్మి, వెంకట్, దైవజ్ఞశర్మ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుడిబండి వెంకటరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో గాజుల నాగార్జున, అమృత, అశోకుమార్, అన్సారి, మురళీకృష్ణ, కుమ్మరి స్వామి, సంతోష్‌కుమార్, ఎంవి శివరావు, రామకృష్ణ, మదన్‌మోహన్, రాణిఅనిమోని, ప్రదీప్, మనీష్‌కుమార్, హరినాథ్‌గుప్త ఉన్నారు.



జీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులను సన్మానించిన దృశ్యం

## రైలు ఇంజన్ ఢీకొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జనవరి 23: రైల్వే స్టీల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఇంజన్ ఢీ కొట్టడడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం...నార్త్ లాలాగూడ, తుకారంగేట్‌కు చెందిన కాంబ్లికోటి (53) సీతాఫల్‌మండి బీ క్యాబిన్– లాలాగూడ గేట్ రైల్వే స్టేషన్ల మధ్యన స్టీల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి రైలు ఇంజన్ వచ్చి ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ మార్చ్యురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల్లేని.. నియోజకవర్గమే లక్ష్యం

కాచిగూడ, జనవరి 23 : స్థానికుల సహకారంతో సమస్యల్లేని నియోజకవర్గమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి మంగళవారం మౌలానా ఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య తలెత్తుతుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డ్రైనేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను అభివృద్ధి చేస్తూ, మౌలిక సదుపాయలు కల్పించేందుకు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అధికారులను ఆయన హెచ్చరించారు. బస్తీలో ఉన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, మేనేజర్ షాకీర్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, మహేశ్‌కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్, బి.కృష్ణాగౌడ్, నాగేందర్‌బాబ్జి, భీంరాజ్ , బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌హిల్స్‌లో ఎమ్మెల్యే పర్యటన

ఆబిడ్స్ , జనవరి 23 రెడ్‌హిల్స్ శాంతినగర్‌లో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, రోడ్లు, సీవరేజీ, విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.